



ఉద్యోగరీత్యా చాలా రోజులు దూరప్రాంతాలల్లోని పల్లెటూళ్ళలో, కొండల నడుమ, అడవుల మధ్య అక్కడక్కడ చిక్కుపడిపోయిన గ్రామాల్లో గడపాల్సి వస్తూంటుంది నేను. ఈ ప్రదేశాలలోకి అడుగుపెట్టినపుడల్లా మరో కొత్త ప్రపంచంలోకి వచ్చి పడ్డట్టుగా, ఏదో బాధగా, ఏదో వెలితిగా, తెలియని ఎవరిమీదనో జాలిగా అదోలా అనిపిస్తూంటుంది ఎప్పటికప్పుడు. ఇక్కడి ప్రజల జీవితాలూ, ఒక్కోరోజు గడపడానికి వాళ్ళు పడాల్సిన కష్టాలూ, మట్టిలో చెమటను చిందించి మట్టిలోనే బ్రతుకులను పండించుకోవాల్సిన గత్యంతరంలేని పరిస్థితులూ— యివన్నీ నన్ను కలచివేస్తూండేవి.

దాదాపు ఓ ఏడాది నాటి సంగతి నేను చెబుతున్నాను.

మా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ క్రింద కొన్ని యాత్రాస్థలాల్లో ఉన్న జంపదర్శతునశాలల్లోని జం-తువుల సంగతి ఎలా ఉందో పరిశీలించడానికని బయలుదేరాను.

అది మే నెల—

ఎండలు మండిపోతున్నాయి. భయంకరంగా నేల కాలుతున్న పెనంలా అయిపోయేది. పది గంటలకల్లా, గాలులు వేడెక్కి నిప్పునెగళ్లా ఒంటిని ఉడికించిపారేసేవి. తొమ్మిది దాటిందంటే యిండ్లలోనుండి మనుషులు బయటికి రావడానికి తుపాకిగొట్టం ఎదుటపడబోతున్నట్టుగా జడిసేవారు.

అడవుల్లో ఎక్కడ చూచినా నీటి బొట్టు కనిపించేదికాదు. ప్రతి ఉదయం లేచేసరికి పెద్దపెద్ద చెట్లక్రింద పక్షులు కుప్పలు కుప్పలుగా చచ్చిపడి ఉండేవి. ఏ చెట్టుమీద చూచినా ప్రతి పక్షీ దప్పితో నోరును వెళ్ళబెట్టి తపించిపోయేది.

ఇక పల్లెటూళ్ళలోని జనం సంగతీ, పశువుల సంగతీ యింకా ఘోరంగా ఉండేవి.

గ్రామాల్లోని బావులన్నింటిలోనూ నీళ్ళు ఎండిపోయి—తాగడానికి గుక్కెడు నీళ్ళులేక తహతహలాడిపోయేవాళ్ళు.

తింటానికి తిండిలేక—తాగడానికి నీళ్ళు లేక ఒక్కో కొండప్రాంతాల్లో ఉన్న గ్రామం అల్లాడి పోయేది.

సిటీలో హాయిగా ఉండడానికీ, ఎటు వెళ్ళినా సుఖంగా జీపులో ప్రయాణం చేయడానికి అలవాటుపడ్డ నేను యీ గ్రామాల్లోని జీవితం యింత దుర్భరంగా ఉంటుందని ఊహించ లేదు ఎన్నడూ.

గత సంవత్సరం కూడా సరిగ్గా వర్షాలు కురియలేదు. అందువల్ల భూమి ఎండి ఎండి పర్రలైపోయి చినుకుల కోసం తపిస్తోంది.

ఎటు చూచినా కరువు...కరువు

దరిద్రం...దరిద్రం—

పశువుల చావులు ... పక్షుల చావులు... అప్పుడప్పుడు మనుషుల మరణాలు.

ఆ రోజు—

నేను పాకాలకు వెళ్ళి జంతువులను పరీక్షించాను. పరీక్షించాక చాలా సిగ్గుపడ్డాను. వాటి బాధ్యత వహించాల్సిన పదవిలో ఉండి ప్రభుత్వం యిస్తున్న చాలీచాలని డబ్బుతో వాటిని అర్ధాకలితో మాడుస్తున్నందుకు. అడవుల్లో స్వేచ్ఛగా ఉండే పులిలా ఉండే పులి యిప్పుడు కుక్కలా తయారైంది. కడుపులో మంటతో, కన్నుల్లో నీళ్ళతో బోనుల్లో నిలబడ్డ యీ జంతువులు వచ్చే ప్రయాణీకులకు సంతోషం కలిగించాలి...హుఁ.

అక్కడినుండి శివునిపేటకు వెళ్ళాం జీపులో.

ఇదివరకు నెలరోజుల క్రితం శివుని పేటకు వెళ్ళినపుడు అక్కడి చుట్టుప్రక్కల రెండుమూడు గ్రామాల జనం లబోదిబోమని మొత్తుకుంటూ వచ్చారు మాదగ్గరికి. కరువులో తాము అనుభవిస్తున్న నరకాన్ని చెప్పి ఏదైనా సహాయం చేయమని కాళ్ళావేళ్ళా పడ్డారు.

ఏం జేయగలం మేం—

కాని ఏదో ఒకటి చేయాలి ... ఎలాగైనా వాళ్ళను ఆదుకోవాలి. పిడికెడు మెతుకుల కోసం, గుక్కెడు నీళ్ళకోసం తపిస్తున్న వాళ్ళకు ఎలాగైనా చేయూత నివ్వాలి... అదీ నావేదన—

కాని...ఎలా...ఎలా.

నా ఫ్రెండ్ రేంజర్‌తో సంప్రదించాను. ప్రాధేయపడ్డాను. చివరికి ఒప్పించి అడవుల్లో చెట్లను కొట్టే కార్యక్రమం, చెట్లకు అంటు కట్టే కార్యక్రమం గ్రాంట్ చేయించాను. ఆ ఊళ్ళకు

జనం పనిలోమునిగిపోయారు. వాళ్ళకు కావలసింది కూళ్ళు కావు, మేం సిటీ నుండి అక్కడికి వెళ్ళినపుడు జీపులో రెండు బస్తాల మొక్కజొన్నలు తీసుకెళ్ళే వాళ్ళం. వాటిని అందరూ సమానంగా పంచుకునేవారు ఎగబడి. సమిష్టిగా కొంతమంది కలిసి ఓ బావిలో నుండి బురద తోడి నీళ్ళు పంచుకునేవారు.

కష్టాల్లో ఉన్నప్పుడు మనుషుల మధ్య ఐకమత్యం దానంతటదే పుట్టుకొస్తుంది.

నేను శివునిపేటకు వెళ్ళేసరికి బాగా ప్రొద్దెక్కింది. జనం చెమటలు కక్కుతూ చెట్లను కొడుతున్నారు. జీపు దిగి మేస్త్రీ దగ్గరకు నడిచాను—

"సార్ సార్ గాడ గడ్డున్నది భూమిల

ప్రజాతంత్ర

...తవ్వుతుంట" అని అడుగుతోంది ఓ స్త్రీ మేస్త్రీతో పర్మిషన్ కోసం.

"ఊఁ" అన్నాడు మేస్త్రీ.

ఆమె పక్షిలా పరుగెత్తింది అటు వేపు.

నాకు అసలు విషయం అర్థంగాలేదు. గడ్డ అంటే ఏమిటి. త్రవ్వడమేమిటి. త్రవ్వి దాన్నేం జేస్తుంది—

అడిగాను మేస్త్రీని "గడ్డేమిటి" అని.

"భూములో అక్కడక్కడ ఏవో చెట్ల వేళ్ళలాంటి గడ్డలుంటై సార్. వీళ్ళు భూమిని తవ్వుతూంటే సులవుగా పనిగడుతారు అదెక్కడుందో. దాన్ని తవ్వి తీసుకుని తింటారు గబగబా. ఆకలి మరి—ఏం జేస్తరు పాపం. కాయో, గడ్డో, ఆకో, అలమో — ఆకలికి ఏదంటే అది—" చెబుతున్నాడు.

మనిషి—జంతువు.

గడ్డలూ, దుంపలూ, ఆకులూ—తింటూ—తేడా ఏమిటి.

యింతకు ముందు పరుగెత్తిన స్త్రీ వంక చూశాను. ఆమె గబగబా పలుగుతో భూమిని త్రవ్వి, మట్టిని తోడి ఓ ముద్దను బయటికి తీసింది. అది నల్లగా ఉంది చకచకాపై పొట్టును గీకేసి తింటోంది. ఆతురతగా... ఆకలిగా... హడావిడిగా.

జాలేసింది.

ఆమె వంక అలాగే చూస్తూ ఉండిపోయాను.

"మనమిచ్చే జొన్నలు ఏం చాలతై సార్ పాపం చచ్చిపోతున్నారు ఆకలితో" అంటున్నాడు. మేస్త్రీ ప్రక్కన. పని చేస్తున్న జనం వంక—చూశాను.

వీపుల కంటుకునే డొక్కలతో, యీడ్చుకు పోయిన ముఖాలతో, వాడిపోయిన తోటకూర కాడల్లాగ పని చేస్తున్నారు—

కరువు మనుషులను కాల్చేస్తోంది. కాటేస్తోంది—

"రేపు నా తరపున ఓ బస్తా జొన్నలను పంపించాలి జీపులో" అనుకున్నాను.

యింతలో—అటు దిక్కు దూరంగా మట్టి రోడ్డుపై నుండి దుమ్ము రేపుకుంటూ ఓ కొత్త జీపు పరుగెత్తుతూ—

యిటు దిక్కు జీపు లెక్కడివి. యీ ప్రాంతాలకు ఫారెస్ట్ వాళ్ళవి తప్పితే ఏ వాహనాలూ రావే—నాకు తెలియకుండా యీ జీపు...?

సరే—విషయం మరిచిపోయి వెనక్కి తిరిగాను త్రోవలో వస్తూ వస్తూ మళ్ళీ పాకాలలో ఆగినపుడు గెస్టు హౌజ్ దగ్గర మళ్ళీ ఆ కొత్త జీపు కనబడింది చెట్టు క్రింద.

గెస్ట్ హౌజ్ అటెండర్‌నడిగాను ఆ జీపు ఎవరిదని.

"ఎవరో పార్లమెంటరీ కమీటట సార్. తెలంగాణాలో కరువు ప్రాంతాలను పరిశీలిస్తున్నారట" అన్నాడు.

లాంజ్‌లోనుండి నడిచి వెళ్తూ వెళ్తూ కిటికీ నుంచి పార్లమెంటరీ కమిటీ తాలూకు మనుషులను చూశాను యాదృచ్ఛికంగా.

ఓ నలుగురు ఇద్దరు లాల్చీల వాళ్ళు కూర్చున్నారు డన్‌లప్ మంచాలపై. వాళ్ళ చంకల్లో మెరుపు తీగల్లాంటి యిద్దరమ్మాయిలున్నారు. నడుమ బ్రాందీ సీసాలున్నాయి ఫ్రై చేసిన కోళ్ళున్నాయి. మల్లెపూల ఘుమఘుమలున్నాయి.

అందరూ నవ్వుతున్నారు హాయిగా. బిగ్గరగా. సంతోషంగా మత్తుగా.

ఓ క్షణమాగి తటపటాయించి. నడిచాను. "పార్లమెంటరీ కమిటీ" అక్షరాలు నా మెదడులో అరుస్తున్నాయి.

—రెండు రోజుల తరువాత ఉదయం టీ త్రాగుతూ దిన పత్రిక చూస్తూంటే—

"తెలంగాణా ప్రాంతంలో విస్తృతంగా పర్యటించిన పార్లమెంటరీ కమిటీ ఆ ప్రాంతంలో కరువులేనట్టుగా అభిప్రాయపడింది...యింకా ఏదో రాశారు.

బ్రాందీ సీసాలు, మల్లెపూలు, చంకల్లో ముండ— —అన్నీ జ్ఞాపకమొచ్చి—

మనసు ఏడుస్తోంది సముద్రంలా. *